ప్రజాశక్తి

మంగళవారం 18 ఫిబ్రవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కు ఆవిర్భావ దినోత్సవానికి మంగళం

◆ ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చే పురస్కారాలకు యాజమాన్యం ఎగనామం

◆ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ చరిత్రలో ఇదే తొలిసారి



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఏ సంస్థకైనా స్థాపించబడిన రోజు అత్యంత ప్రాముఖ్యమైనది. అందులో పనిచేసే ఉద్యోగులు, యాజమాన్యానికి నిజమైన పండగ రోజు. కానీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ చరిత్రలో మొదటిసారి ఆ రోజును ఉద్యోగులు, కార్మికులు మరిచిపోవాల్సిన పరిస్థితులను యాజమాన్యం కల్పిం చింది. డబ్బుల్లేంటూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మంగళం పాడేసింది. దీంతో కార్మికవర్గం నిరాశకు గురైంది.

ఎలాగైనా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మట్టుపెట్టాలన్న పట్టుదలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉక్కు విషయంలో తీసుకున్న ప్రైవేటీకరణ వైఖరికి అద్దం పట్టేలా 'ఉక్కు' ఆవిర్భావ దినోత్సవానికి యాజమాన్యం ఎగనామం పెట్టినట్టు కనిపిస్తోంది. ఉక్కు కార్మికులకు రూ.11400 కోట్ల ప్యాకేజీ సాధించిన ఘనత తమదేనంటూ జబ్బలు చరచుకుంటున్న కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేన, బిజెపి రాష్ట్ర నాయకులు స్టీల్‌ప్లాంట్ స్థాపించిన రోజును కూడా నిర్వహించలేని స్థితిలో ఎందుకు పడ్డారో వారే చెప్పాలి.

విశిష్టమైన రోజు.. 1982 ఫిబ్రవరి 18

1982 ఫిబ్రవరి 18న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైంది. దేశంలోనే ఏకైక తీర ఆధారిత స్టీల్‌ప్లాంట్ ఇదే. 2010లో ఉక్కుకు భారత ప్రభుత్వం 'నవరత్న' హోదా ఇచ్చింది. సెయిల్ నుంచి ఆర్ఐఎన్ఎల్‌గా మార్చబడిన నాటి నుంచీ 2024 సంవత్సరం వరకూ ఇదే రోజున అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నారు. 1970లో దేశ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రకటన చేస్తూ విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం నిర్మించనుందని వెల్లడించారు. 1971 జనవరి 20న ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగింది. 2024 ఫిబ్రవరి 18న 42వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంది. తాజాగా ఈ ఏడాది 2025లో మాత్రం యాజమాన్యం ససేమిరా అంటోంది. ఉక్కు ఉద్యోగ, కార్మికుల్లో బాగా సేవలందించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఆవిర్భావ దినోత్సవాన 'నెహ్రూ అవార్డులు' అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఫార్మేషన్ డేకు ఈ ఏడాది స్టీల్ యాజమాన్యం మంగళం పలికేయడంతో అవార్డుల కార్యక్రమం కూడా లేనట్టే లెక్క. డబ్బుల్లేవని, అందువల్లే ఆవిర్భావ దినోత్సవాన్ని జరపడం లేదని ప్లాంట్ యాజమాన్యం కుంటిసాకులు చెబుతోంది. 1466 రోజులుగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోడానికి ఓ వైపు పోరాటాన్ని సాగిస్తూనే మరోవైపు ఉత్పత్తి విషయంలో కార్మికులు వెనక్కి తగ్గకుండా శ్రమిస్తున్నారు. ఉత్పత్తి పెరుగుతున్నా సరే స్టీల్ కార్మికులకు ఐదు నెలలుగా పూర్తి స్థాయిలో జీతాలివ్వకుండా మిగతా 2లో..



పెందుర్తిలో జరిగిన ధర్నాలో సుబ్బరావమ్మ, అంగన్‌వాడీలు

వేతనాలు పెంచాలి

◆ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

◆ పలుచోట్ల అంగన్‌వాడీల ధర్నాలు

సమస్యలను పరిష్కరించాలంటూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీలు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల ధర్నాలు నిర్వహించారు. విశాఖలో జరిగిన ఆందోళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలు చేపట్టిన చారిత్రాత్మక సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

(వార్తలు 8వ పేజీలో..)

మార్చి రెండో వారంలో చలో విశాఖ డెయిరీ

▶ వార్త 6లో..

విలేకరిపై దాడిని ఖండిస్తూ నిరసనలు

▶ వార్త 2లో..

ఫిర్యాదులపై లోతైన విశ్లేషణ అవసరం

▶ వార్త 2లో..



బ్యాలెట్ పత్రాల బాక్సులను భద్రపరుస్తున్న సిబ్బంది

జిల్లాకు చేరిన బ్యాలెట్ పత్రాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి ఈ నెల 27న జరుగనున్న ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు సోమవారం జిల్లాకు చేరుకున్నాయి. ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, పోటీ చేసే అభ్యర్థుల ఫొటోలు, ఇతర వివరాలతో కూడిన నివేదికలను స్థానిక అధికారులు ఇప్పటికే పంపించారు. ఆ మేరకు సంబంధిత బ్యాలెట్ పత్రాలను కర్నూలులో ప్రింటింగ్ చేశారు. అక్కడి నుంచి వాటిని ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం కలెక్టరేట్‌కు సోమవారం తీసుకొచ్చారు. పది శాతం రిజర్వ్‌తో కలిపి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్యకు మిగతా 2లో..

రేణుకా మహంతి మృతిపై సందేహాలు

ఆమె చనిపోయింది జిబిఎస్‌తోనా ? గుండెపోటుతోనా ?



రేణుకా మహంతి ఆరోగ్య స్థితిని తెలుసుకుంటున్న కెజిహెచ్ సూపరింటెండెంట్ శివానంద (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో గులియన్ బారే సిండ్రోమ్ (జిబిఎస్) వ్యాధితో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిన విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం మల్లివీడు గ్రామానికి చెందిన రేణుకా మహంతి (63) ఘటనపై పలు సందేహాలు, విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఆమె గుండె జబ్బుతో మరణించినట్లుగా కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ప్రకటిస్తూ మీడియాకు సమాచారం ఇచ్చారు. జిబిఎస్‌తో ఆమె చనిపోలేదని ఆయన చెప్పుకొచ్చారు. అయితే ఆమె మృతి చెందడానికిగల కారణాలపై మాత్రం రకరకాల చర్చలు నడుస్తున్నాయి. ఈ నెల 6న కెజిహెచ్‌లో జిబిఎస్ సిండ్రోమ్ వ్యాధితో రేణుకా మహంతి చేరారు. ఆమెను జనరల్ మెడిసిన్ విభాగంలో ఇన్ పేషెంట్‌గా ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జివిఎస్.శ్రీనివాసరావు ఆమెకు వైద్య సేవలు అందివ్వడంతో పాటు, నిత్యం ఇక్కడి రోగుల ఆరోగ్య విషయాలుపై జాగ్రత్తలు తీసుకోవలసి ఉంది. అయితే ఆమె ఈ వార్డులో చేరినప్పటి నుంచి ఒక్కరోజు కూడా ఆయన ఆమెకు వైద్య సేవలు అందించనట్టు, కనీసం పేషెంట్‌ను కూడా ఆయన చూడనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ఈ విభాగంలో చికిత్సలు పొందుతున్న ఆరుగురు రోగులను మార్నింగ్ విజిట్ సమయంలో వచ్చి చూసి పరిశీలించారు. ఆ సమయంలో కూడా ప్రొఫెసర్ శ్రీనివాసరావు లేరని తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే ప్రొఫెసర్ శ్రీనివాసరావు నిర్లక్ష్యం కూడా రేణుకా మహంతి మరణానికి కారణంగా పలువురు భావిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ మొత్తం సంఘటనపై సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లుగా తెలిసింది. దాని పర్యవసానం ఎలా ఉంటుందనేది తెలియాల్సి ఉంది.

మొదటి పేజీ తరువాయి..

ఉక్కు ఆవిర్భావ దినోత్సవానికి మంగళం

యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోంది. స్టీల్‌ప్లాంట్‌కు భూములు త్యాగం చేసిన నిర్వాసితులనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కన్నెత్తి చూస్తున్నాయా ? అంటే అదీ లేదు. ప్లాంట్‌లో ఉన్న వారిని ఎలా తగ్గించేసి ఉపాధిని దెబ్బకొట్టాలన్న కుట్రలకే యాజమాన్యం కాలం వెచ్చిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాకు చేరిన బ్యాలెట్ పత్రాలు

సరిపడా సంబంధిత పత్రాలను స్థానిక అధికారులు సేకరించి భద్రపరిచారు. ఎఆర్ఒ, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్ ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం సంబంధిత వాహనానికి పోలీసులు, ఇతర లైజనింగ్ అధికారుల సమక్షంలో సీలు వేసి ఉత్తరాంధ్ర జిల్లాలకు పంపించారు.

డాక్టర్ అచ్యుతరావుపై బదిలీ వేటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఆర్థోపెడిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంపోలు అచ్యుతరావుపై బదిలీ వేటు పడింది. విధులు సరిగా నిర్వహించకుండా, అక్రమాలకు పాల్పడే ప్రభుత్వ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే డాక్టర్ అచ్యుతరావు వ్యవహారంపైనా దర్యాప్తు సాగినట్లు తెలుస్తోంది. వికలాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలకు పాల్పడినట్లు, ఆపరేషన్లు చేయడానికి డబ్బు తీసుకుంటున్నట్లు, సహకార సిబ్బంది, వైద్య విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర సీనియర్ల ఆదేశాలను ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఆయనపై బదిలీ వేటు పడినట్లు వైద్యులు చెబుతున్నారు. ఆయనపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే సమగ్ర విచారణ జరపాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు.



రాజుగారి పాకశాల అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న వెలగపూడి, ప్రణవ్‌గోపాల్

రాజుగారి పాకశాల అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర వంటకాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలని సంకల్పించిన గెహనా కలినరీ ఆర్ట్స్ ఆధ్వర్యంలోని రాజుగారి పాకశాల తన మొదటి ప్రీమియం టేక్ అవే అవుట్‌లెట్‌ను నగరంలోని రామనగర్ చర్చి ఎదుట సోమవారం ప్రారంభించింది. ఈ ప్రాంగణ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, చెన్నుబోయిన వంశీ కృష్ణ శ్రీనివాస్, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ రాజుగారి పాకశాలలో వండిన పలావ్ తినగానే ఆనాటి రుచులు గుర్తుకు వచ్చాయన్నారు. ఇలా సంప్రదాయ వంటకాలను అందించడం అభినందనీయమని అన్నారు. ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఇక్కడ అందుబాటులో ఉన్న ప్రత్యేకమైన కొబ్బరి జున్ను రుచి అద్భుతమని, ఇది మన ప్రాంతపు వంటకాల ప్రత్యేకతను తెలియజేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ వేసవిలో తనకు దొరికిన ఉత్తమ శీతల పానీయం ఇక్కడ తాగిన లస్సీ మాత్రమేనన్నారు. ఇది ఖచ్చితంగా విశాఖ ప్రజల అభిమాన పానీయంగా మారుతుందన్నారు.

కంచర్ల చేయూత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో ఒక న్యూస్ ఛానల్‌లో కెమెరామ్యాన్‌గా పనిచేస్తున్న చుక్కల విజయ్ కుమార్ తండ్రి ఆంథోని మృతిచెందడంతో ఆ కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఉపకార్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు అందించారు. జర్నలిస్టులు, కళాకారులు, సినిమా రంగానికి చెందిన వారి కుటుంబాల్లో ఎవరు కాలం చేసినా అచ్యుతరావు మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు ఆర్థిక సహాయం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే కెమెరామ్యాన్ తండ్రి పరమపదించడంతో తనవంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందించి ఆర్థిక చేయూతనందించారు. ఆయనకు కెమెరామ్యాన్ విజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అచ్యుతరావు మాట్లాడుతూ తనకు మీడియా అంటే ఆరో ప్రాణమని చెప్పుకొచ్చారు.

విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 2013లో చీలికకు గురైన న్యూ డెమోక్రసీ పార్టీలు విలీనమవుతున్న తరుణంలో ఈ నెల 23న విజయవాడలో సభ నిర్వహిస్తున్నట్టు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం ఏరియా కమిటీ అధికార ప్రతినిధి వై.కొండయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విజయవాడ వేదికగా మళ్లీ బలమైన ఉద్యమ నిర్మాణాలకు అవకాశం ఏర్పడుతుందని, ఈ సానుకూల పరిణామాన్ని విప్లవ శక్తులు, ప్రజాస్వామిక శక్తులు, అస్తిత్వవాదులు బలపరచాలని కోరారు.

విలేకరిపై దాడిని ఖండిస్తూ నిరసనలు

టిడిపి నేత వేణుగోపాల్ నాయుడును అరెస్టు చేయాలని డిమాండ్



విశాఖలోని డిఐజి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి రామారావుపై టిడిపి మండల నాయకుడు వేణుగోపాల్ నాయుడు దాడిని ఖండిస్తూ సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో జర్నలిస్టులు నిరసనలు తెలిపారు. తక్షణమే నిందితున్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వాలు చట్టం చేయాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు డిమాండ్ చేశారు. రామారావుపై టిడిపి నేత దాడిని ఖండిస్తూ సోమవారం ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖలోని డిఐజి కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. డిఐజి కార్యాలయ మేనేజర్ సూర్యారావు, సిసి గణేష్‌లను కలిసి వినతిపత్రం అందించారు. అంతకు ముందు ఎయు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి, అక్కడి నుంచి జర్నలిస్టులంతా ర్యాలీగా డిఐజి కార్యాలయానికి చేరుకున్నారు. జర్నలిస్టులను కాపాడాలని, దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, జర్నలిస్టుల ఐక్యత వర్థిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ నాయకులు ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలని, అలా కాకుండా జర్నలిస్టులను చంపుతానని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మధుసూదనరావు మాట్లాడుతూ వేణుగోపాల్ నాయుడును తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కె.మధన్, ఉపాధ్యక్షులు మళ్ల దేవత్రినాథ్, నాయుడు, ఎపిడబ్ల్యుజె జిల్లా కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్‌మోహన్, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు కె.అప్పలనాయుడు, ఎం.వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ, పి.వెంకట్, రామకృష్ణ, నగేష్‌బాబు, కృష్ణమూర్తి, పి.సతీష్‌బాబు, కిషోర్, రాజేష్, శ్రీలత పాల్గొన్నారు.

చోడవరం : పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావుపై దాడి చేసిన టిడిపి మక్కువ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు చోడవరం మండల తహశీల్దారుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి.కాంతారావు మాట్లాడుతూ టిడిపి వ్యతిరేక వార్తలు రాస్తున్నారని కక్షతో ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. రామారావును కొట్టడమే కాకుండా చంపుతామని బెదిరిస్తున్నారని, దీంతో రామారావు ప్రాణహాని ఉందని, ఆయనకు రక్షణ కల్పించాలని కోరారు. టిడిపి నేతపై చర్యలు చేపట్టకపోతే జిల్లా స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి ఏడివిటీ జిల్లా ఇన్చార్జి రాజేష్ రెడ్డి, డివిజన్ ఆర్గనైజర్ గణేష్, పాత్రికేయులు కోవెల శ్రీనివాసరావు, కడియం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చోడవరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ఫిర్యాదులపై లోతైన విశ్లేషణ అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఒకే సమస్యపై ప్రజల నుంచి పదేపదే వచ్చే వినతులపై లోతైన విశ్లేషణ అవసరమని, తగిన విధంగా నాణ్యమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో వస్తున్న ఫిర్యాదులు, అధికారులు తీసుకుంటున్న చర్యలపై సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమావేశంలో సుదీర్ఘంగా సమీక్షించారు. అధికారులకు పలు అంశాలపై అనుసరించాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు. అధికారులందరూ పిజిఆర్‌ఎస్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల నుంచి వచ్చే అర్జీలపై సత్వరమే స్పందించాలని సూచించారు. ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డ తర్వాత వాటి పరిష్కారం కోసం అధికారుల వద్దకు వస్తారని, అలా వచ్చే వారికి సాంత్వన చేకూర్చే విధంగా అధికారులు నడుచుకోవాలని, వారి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించి భరోసా కల్పించాలని అన్నారు. పదేపదే ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పించుకోవటం ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు.

దారితప్పిన బాలురకు ఆసరా...

అమ్మలా ఆదరిస్తున్న గృహాలు

ప్రజాశక్తి - ఆరిలోవ

ఏ కారణమైతేనేమి ఒంటరి అయిన బాలలకు తానున్నానంటూ ఆసరా కల్పిస్తోంది బిఆర్‌టిఎస్ రోడ్డు ముడసర్లోవ రహదారిలోని దీనదయాళ్‌పురం వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర గృహం. ఇంట్లో నుంచి పారిపోవడం, తల్లిదండ్రులు దూరం కావడం, సింగిల్ పేరెంట్ ఉండడం, తల్లిదండ్రుల మధ్య గొడవలు, తల్లిదండ్రులు విడిపోవడం, మురికి వాడల ప్రభావం, స్నేహితుల మాట విని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోవడం.. ఇలా పలు కారణాలతో పలు ప్రదేశాల నుంచి వచ్చి రోడ్లపైనా, రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల వద్ద తిరుగుతూ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న బాలలకు ఈ ప్రభుత్వ బాలుర గృహం బాసటగా నిలుస్తోంది. ఈ గృహం పక్కనే ప్రభుత్వ బాలుర పరిశీలన, ప్రత్యేక గృహాలు, బాలుర సురక్షిత స్థలం కూడా ఉన్నాయి. ఇవన్నీ చట్టాల పరిధిలో నడిచే గృహాలు.



ప్రభుత్వ బాలుర గృహం

ప్రభుత్వ బాలుర గృహం..

ప్రభుత్వ బాలుర గృహం అనేది ఒక అనాథ ఆశ్రమం వంటిదని చెప్పాలి. ఇంట్లో పరిస్థితులు భరించలేక కొందరు పిల్లలు పారిపోతుంటారు. తండ్రి చనిపోవడం, ఇతర కారణాలతో దూరం కావడం, తల్లి మరొకరిని పెళ్లి చేసుకోవడం వల్ల మరికొందరు పిల్లలు అనాథలవుతారు. ప్రమాదాలు ఇతర కారణాలతో తల్లిదండ్రులు ఒకేసారి చనిపోవడం, అదుకునే బంధువులు లేక ఒంటరి అయినవారు ... ఇలా పలు కారణాలతో దిక్కుతోచని స్థితిలో చిక్కుకున్న చిన్నారులకు ఈ కేంద్రం అమ్మఒడిలా ఆదుకుంటుంది. ప్రస్తుతం ఈ గృహంలో 40 మంది చిన్నారులు ఆశ్రయం పొందుతున్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఈ గృహంలో ఆశ్రయం పొందుతున్నారు. సాధారణంగా ఇటువంటి పిల్లలు విశాఖ వంటి నగరాలకు చేరిపోతారు. హోటళ్లలో పనిచేస్తూ, రైళ్లలో బిచ్చమెత్తుకుంటూ కొందరు, రోడ్లపైనా, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో తిరుగుతూ కాలం గడుపుతుంటారు. వారిని గుర్తించిన పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి)తో పాటు మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు న్యాయస్థానం ముందు ఉంచి వారు ఎక్కడికీ వెళ్లడానికి ఇష్టపడక పోతే న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఈ కేంద్రానికి తీసుకొస్తారు. వారికి తిండి, దుస్తులు, వసతి కల్పించడంతో పాటు విద్యాబుద్ధులు, వృత్తిపరమైన శిక్షణ అందజేస్తారు.

ప్రభుత్వ పరిశీలన గృహం..

ఐపిసి ప్రకారం సంఘంతో విభేదించబడ్డ బాలురను ఈ పరిశీలన గృహంలో ఉంచుతారు. గంజాయి (ఎన్‌డిపిఎస్), పోక్సో మున్నగు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కుంటున్న 18 ఏళ్ల లోపు ఉన్న బాలురను ఈ గృహంలో ఉంచుతారు. వీరికి ఇదే ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కోర్టులో వాయిదాలు జరుగుతుంటాయి. ఇక్కడ కూడా న్యాయవాదులు, జడ్జి ఉంటారు. ఈ కోర్టులో న్యాయవాదులు, జడ్జి సాధారణ దుస్తుల్లోనే కనిపిస్తారు. ఈ గృహంలో ప్రస్తుతం 57 మంది బాలురు ఉన్నారు.

ప్రభుత్వ బాలుర ప్రత్యేక గృహం..

ప్రభుత్వ బాలుర ప్రత్యేక గృహంలో 18 ఏళ్ల లోపు బాలురు సంఘంతో విభేదించి నేరం రుజువు అయి న్యాయస్థానం శిక్ష విధించే బాలురు ఉంటారు. నిర్ధయ కేసు అనంతరం 16 ఏళ్లలోపు ఉన్న బాలురు ఘర్షణ పడితే ఇక్కడికి తీసుకుంటున్నారు. 21 ఏళ్ళ దాటిన తరువాత మిగిలిన శిక్ష అనుభవించేందుకు కేంద్ర కారాగారానికి పంపిస్తారు. ప్రస్తుతం ఈ గృహంలో నలుగురు బాలురు ఉంటున్నారు.

నేరాలు ఘోరాలు

బంగారు వస్తువుల అపహరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం గొల్లల తాళ్లవలస ఆర్.కె.టౌన్‌షిప్‌లో ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఓ ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు వస్తువులను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారు. నేర విభాగం ఎస్ఐ సూర్యప్రకాశ రావు కథనం ప్రకారం.. ఇంటి తాళం వేసి తమ ముగ్గురు పిల్లలకు ఇచ్చి ఎప్పటి వలెనే పిన్నింటి నూకాలమ్మ, భర్త కలిసి కూలి పనికి వెళ్లిపోయారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపు తాళం తీసి ఉంది. ఇంట్లో ఉన్న బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న సుమారు పావు తక్కువ మూడు తులాల బంగారు పుస్తెల తాడు, చెవి బుట్టలు కనబడ లేదు. పిల్లల్ని పక్కకు నెట్టేసి ఇంట్లోకి వెళ్లి దొంగతనానికి పాల్పడినట్లు బాధితురాలు నూకాలమ్మ ఆదివారం రాత్రి నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -యస్ రాయవరం : మండలంలోని అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం నక్కపల్లి మండలం గొడిచెర్ల జగన్నాధపురం గ్రామానికి చెందిన కొత్వాల నూకరాజుఅడ్డరోడ్డు నుండి స్వగ్రామం జగన్నాధపురం వెళ తుండగా, కుమార్ దాబా వద్ద అదే మార్గంలో పయనిస్తున్న కారు వేగంగా వచ్చి వెనుక నుండి బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు ఘటనాస్థలికి చేరుకుని బాధితుడిని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్సానంతరం విశాఖ కిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.పరిస్థితి విషమించడంతో కెజిహెచ్‌కు తరలించినట్లు వారు తెలిపారు. బంధువులిచ్చిన ఫిర్యాదు మేరకు యస్ రాయవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీలోని శేషుకొండ కాలనీకి చెందిన 18 ఏళ్ల యువతి రంగాల రాజేశ్వరి అదృశ్యమైనట్లు టౌన్ ఎస్ఐ సావిత్రి తెలిపారు. రాజేశ్వరి ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో అదృశ్యమైనట్లు గమనించామని ఆమె తండ్రి లోవరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై కేసులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్టు పట్టణ ఎస్సై ఈశ్వరరావు తెలిపారు. ట్రైనీ డిఎస్పి చైతన్యతో కలిసి అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు, వివిధ ధాబాలు, ఇతర ప్రాంతాల్లో సోమవారం దాడులు నిర్వహించినట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న సుమారు 25 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యముగా దాబాలు ఉన్న ప్రదేశాలలో ఎక్కువగా బహిరంగంగా మద్యం సేవిస్తున్నట్లు దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఆయా ప్రదేశాలపై నిఘా ఉంచామని, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థినులకు పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక గొల్లలపాలెం, కెజిబివిలో సోమవారం 6, 8 తరగతుల విద్యార్థినులకు తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో మౌఖిక, రాత పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థినుల్లో అభ్యసనా సామర్థ్యం పెరుగుతుందని జిసిడిఒ కలిషా బేగం అన్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థినుల పట్ల అత్యంత శ్రద్ధ చూపాలని, ఒత్తిడికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలని కోరారు. అనంతరం ప్రయోగశాల, పలు రికార్డులు, స్టోర్ రూం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ గంగా కుమారి పాల్గొన్నారు.

పిఎఫ్ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జ్యూట్ మిల్లు కార్మిక సంఘాలైన కాకాస, ఎఐటియుసి ప్రతినిధులు సోమవారం విశాఖ నగరంలోని పిఎఫ్ కార్యాలయంలో ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ పవన్ జాస్తికి వినతి పత్రం అందజేశారు. పిఎఫ్ సొమ్ము చాలా కాలం నుంచి కార్మికులకు ఇవ్వలేదని, కొన్ని సాంకేతిక పరమైన కారణాలు చూపి పిఎఫ్ కోసం పెట్టుకున్న దరఖాస్తులు తిరిగి పంపిస్తున్నారని పిఎఫ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జ్యూట్ మిల్లు కార్మికుల వారసత్వ హక్కుగా ఉద్యోగాలు పొందిన కార్మికుల పేర్లు మార్పుపై సత్వరమే న్యాయం చేయాలని కోరారు. వీలైనంత త్వరగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, కె.రాంబాబు, ఎం.అప్పలరాజు ఉన్నారు.

కేర్ ఆసుపత్రిలో రోగి మృతి

హాస్పిటల్ వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్ సిటీలోని కేర్ ఆసుపత్రిలో ఒక రోగికి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చికిత్సకు అయిన మిగతా బిల్లు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యం చెప్పింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రోగి మృతి చెందాడని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చోడవరానికి చెందిన బండి శ్రీధర్(55) ఛాతీ నొప్పితో ఆదివారం సాయంత్రం కేర్ ఆసుపత్రిలో చేరారు. హార్ట్ ఆపరేషన్ పడుతుందని, స్టంట్ వేయాలని చెప్పి ఆసుపత్రి యాజమాన్యం రోగి బంధువుల నుంచి రూ.60 వేలు కట్టించుకున్నారు. అర్ధరాత్రి 1 గంటకు రోగి బంధువులు ఐసియులోకి వెళ్లి చూడగా రోగి మృతి చెందినట్టు గుర్తించారు. మృతిచెందిన విషయాన్ని రోగి బంధువులే వైద్యులకు చెప్పాల్సిన దుస్థితి వచ్చిందని, ఆసుపత్రి వర్గాలు తమకు తెలపలేదని మృతుని కుటుంబీకులు ఆవేదన వ్యక్తంచేశారు. రూ.5 లక్షలు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లాలని యాజమాన్యం చెప్పడంతో రోగి బంధువులు ఆందోళనకు దిగారు. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు సిబ్బందితో వచ్చి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. చివరకు రోగి బంధువులు రూ.1.10 లక్షలు ఆసుపత్రి యాజమాన్యానికి చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లారు.



ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

దొంగతనాలు చేస్తున్న నిందితుడు అరెస్టు

- రూ.32 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఈ నెల 14వ తేదీ తెల్లవారు జామున 2:25 గంటలకు, మరలా ఉదయం 11 గంటల ప్రాంతంలో రెండు వరుస దొంగతనాలకు పాల్పడిన దొంగను అదేరోజు సాయంత్రం అరెస్టు చేసినట్లు విశాఖపట్నం క్రైమ్ డిసిపి కె.లతామాధురి తెలిపారు. సోమవారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున డయల్ 112కు వచ్చిన కాల్ ఆధారంగా ఈరంకి వీర వెంకట సత్య రత్నానికి చెందిన ఇంటిలో దొంగతనం జరిగింది. ఈ కేసు విచారణలో ఉండగా అదే ప్రాంతంలో అదే రోజు ఉదయం 11 గంటలకు మరో దొంగతనం జరిగినట్లు డయల్ 112కు కాల్ వచ్చిందని తెలిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారని, 30 తులాల బంగారం, కేజీ వెండి, రూ.1 లక్ష నగదుతో పాటు ల్యాండ్ డాక్యుమెంట్స్ చోరీకి గురయ్యాయని గుర్తించినట్లు పేర్కొన్నారు. వెంటనే సిసిఎస్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరాల సహాయంతో నూనెల కృష్ణ, అలియాస్ పొట్టి కృష్ణ, అలియాస్ చెవుడు కృష్ణ (41)ను నిందితునిగా గుర్తించి అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. అతని నుంచి చోరీకి గురైన 30 తులాల బంగారం, కేజీ వెండి రూ.73 వేల నగదు రికవరీ చేసినట్లు చెప్పారు. రికవరీ చేసిన సొత్తు మార్కెట్ విలువ సుమారు రూ.32 లక్షల వరకు ఉంటుందన్నారు. నిందితునిపై ఇప్పటికే నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 20 పైకి కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కేసులలో నిందితుణ్ని 12 గంటల వ్యవధిలోనే అరెస్టు చేశామని, చోరీ సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులను ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ద్వారకా సబ్ డివిజన్ క్రైమ్ సిఐ వి.చక్రధరరావు, ఆరిలోవ క్రైమ్ ఎస్ఐ హరికృష్ణ, సిసిఎస్ సిఐలు రామారావు, ఎర్రం నాయుడు, శంకర్ నారాయణ, జోన్ - 1 క్రైమ్ సిబ్బందిని ఆమె అభినందించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులను చూపిస్తున్న క్రైం డిసిపి

వెంకటసుబ్బయ్యకు అవార్డు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్, జెఎన్‌టియు విజయనగరం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.వెంకటసుబ్బయ్యకు 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన ఐఎస్‌టిఇ నేషనల్ బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డు లభించింది. ఈ అవార్డును పంజాబ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, ఎఐసిటిఇ చైర్మన్ ప్రొఫెసర్ టిజి.సీతారామ్‌లు లామ్‌రిన్ టెక్ స్కిల్ యూనివర్సిటీలో (రోపర్, పంజాబ్) జరిగిన 54వ ఐఎస్‌టి నేషనల్ వార్షిక ఫ్యాకల్టీ కాన్వెన్షన్‌లో అందజేశారు. వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రొఫెషనల్ బాడీల్లో ప్రాధాన్యమైన నాయకత్వాన్ని, శాస్త్రీయ పరిజ్ఞానానికి వారి అంకితభావాన్ని, సాంకేతిక విద్యలో పరిశోధన, ఆవిష్కరణలలో ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య చేసిన అమూల్యమైన కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకట సుబ్బయ్యకు ఆంధ్రా విశ్వవిద్యాలయ ఆచార్యులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



ఇళ్లు కోల్పోయిన ప్రాంతాలను పరిశీలిస్తున్న చినఅప్పలనాయుడు

నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-పెందుర్తి : ఆనందపురం నుంచి పెందుర్తి కూడలి వరకు రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు డిమాండ్‌చేశారు. బాధితులంతా చినఅప్పలనాయుడును ఆశ్రయించడంతో ఆయన సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా చినఅప్పలనాయుడు మాట్లాడుతూ, తాను కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు బిఆర్‌టిఎస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారికి టిడిఆర్‌లు, నష్టపరిహారం ఇప్పించానని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో సింహాచలంలో కూడా ఇళ్లు కోల్పోయిన వారికి టిడిఆర్‌లు ఇప్పించామని చెప్పారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా ఇళ్ల తొలగించడం చాలా అన్యాయమన్నారు. ఈ రోడ్డు విస్తరణలో అవకతవకలు జరిగాయని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు నాయయం జరిగే వరకు పోరాడతామని స్పష్టంచేశారు.

గీతం ఎంబిఎ విద్యార్థుల కోసం ఐసిఐపి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా ఎంబిఎ అభ్యసిస్తున్న విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధ్యయనం చేయడం పరిష్కారాలు కనుగొనడంపై శిక్షణ ఇవ్వటానికి యుఎస్‌ఎ, యుకెలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన విశ్వవిద్యాలయాల నిపుణులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ, ఈ భాగస్వామ్య ఒప్పందం ద్వారా అంతర్జాతీయ బంధాలు బలోపేతం అవుతాయన్నారు. గీతం ఎంబిఎ విద్యార్థులు ఐసిఐపి కార్యక్రమంలో భాగంగా అమెరికా, యుకెలలోని భాగస్వామ్య విశ్వవిద్యాలయాలకు వెళ్లి తొమ్మిది నెలల పాటు వివిధ అంశాలపై అధ్యయనం చేస్తారని తెలిపారు. అంతర్జాతీయ కార్పొరేట్ రంగ వాతావరణాన్ని పరిశీలించి అధ్యయనం చేసే అవకాశం వల్ల ఎంబిఎ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. భవిష్యత్తులో భాగస్వామ్య విశ్వవిద్యాలయాలతో సంయుక్త కోర్సులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో గీతం స్కూల్ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు, గీతం అసోసియేట్ డీన్ డాక్టర్ వై.రాధిక, డాక్టర్ సాయి సుధాకర్, ఎంబిఎ బోర్డు ఆఫ్ స్టడీస్ కో-చైర్మన్ డాక్టర్ డి.విజయగీత, ఎంబిఎ కోర్సుల చైర్మన్ డాక్టర్ సుబ్రమణ్యం, గీతం ఆర్‌డిసి డిప్యూటీ డైరక్టర్ వి.గణపతి, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్‌మింగ్‌టన్ ప్రతినిధులు డాక్టర్ క్రిస్ ఫినెల్లి, డాక్టర్ నివైన్‌రిచి, డాక్టర్ మనోజ్ వనజాకుమారి, జెర్రిబెంటన్ పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన బొత్స

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ ఎంపిటిసి దొంతల కనకరాజు మేనకోడలు మౌనిక నిశ్చితార్థం కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మణిశంకర్‌నాయుడు, జెడ్‌పిటిసి కోరాడ వెంకట్రావు, ఎంపిపి మజ్జి వెంకట్రావు, నాయకులు బంక సత్యం, ఇల్లాపు వెంకట్‌జగన్, గంటా జగదీష్, పిన్నింటి రమణ పాల్గొన్నారు.

రహదారిపైనే పార్కింగ్

- రోడ్డు పొడువునా ప్రయివేటు బస్సులు, గూడ్స్ వాహనాలు నిలిపివేత
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రామాటాకీస్ రోడ్డులో నిలిపి ఉంచిన ప్రయివేటు వాహనాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని రామా టాకీస్ నుంచి సత్యం జంక్షన్‌కు వెళ్లే మార్గంలో తెల్లారింది మొదలు పెద్ద చిన్న వాహనాలు వేల సంఖ్యలో పరుగులు పెడుతుంటాయి. ఇలాంటి ముఖ్య రహదారిలో సగానికి పైగా ఆక్రమించి ప్రైవేట్ బస్సులను పార్కింగ్ చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, అంబేద్కర్ భవనం ఎదురుగా రోడ్డుపైనా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రైవేట్ బస్సులు ఒకదాని వెనుక మరొకటి మూడు నాలుగు బస్సులు పార్కింగ్ చేస్తూ ఉంచుతున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకుగా ఉన్న మార్గంలో బస్సుకు సమీపం నుంచి మిగిలిన వాహనాలు వెళ్లాల్సిన దుస్థితివుంది. ఈ బస్సుల పక్క నుంచి కారు లేదా పెద్ద వాహనాలు వెళ్తే ద్విచక్ర వాహనదారులు పక్కగా ఆగిపోవాల్సిందే. ప్రైవేట్ బస్సులు ప్రయాణించేటప్పుడు మలుపు తిరిగే సమయంలోనే అటుగా ప్రయాణించే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వస్తోంది. ఇతరుల ఇబ్బందులతో తమకు పనిలేదన్నట్లు ఈ బస్సుల డ్రైవర్లు రహదారికి అడ్డంగా పెట్టి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఇతర వాహనదారులు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. గట్టిగా ఎవరైనా అడిగితే ట్రాఫిక్ పోలీసులకు డబ్బులు చెల్లిస్తున్నామని చెప్పడం శోచనీయం.

బస్సులు రోడ్డుపై పార్కింగ్ చేయడం ఒక ఎత్తు అయితే ఉదయం బస్సుల నుంచి ప్రయాణికులు దిగి లగేజ్ తీసుకెళ్లే వరకు మరో వాహనం వెళ్లేందుకు దారి లేకుండా చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు సామాగ్రిని సైతం బస్సు పక్క డోర్లు ఎత్తి ద్విచక్ర వాహనం కూడా వెళ్లేందుకు వీల్లేకుండా తోపుడు రిక్షాలు పెట్టి లగేజ్ ఎక్కిస్తుంటారు. ఆ రహదారి గుండా విద్యాసంస్థలకు, కార్యాలయాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, అప్పుడప్పుడు మొక్కుబడిగా ట్రాఫిక్ పోలీసులు వచ్చి కొద్దిసేపు హడావిడి చేసి వెళ్లిపోతుంటారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ ఉన్నతాధికారులు పరిశీలించి ఈ రోడ్డులో ప్రయివేటు బస్సులు నిలపకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పిహెచ్‌డి స్కాలర్లకు న్యాయం చెయ్యాలి



నిరసన తెలుపుతున్న పరిశోధక విద్యార్థులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఎపి ఆర్ సెట్ ద్వారా ఆంధ్ర విశ్వ విద్యాలయంలో వివిధ విభాగాలలో పార్ట్ టైం పరిశోధకలుగా ప్రవేశం పొందిన 679 విద్యార్థుల ప్రొసీడింగ్స్ నిలిపివేస్తూ 2025 జనవరి 28న డీన్ ఆఫ్ అకాడమిక్ అఫైర్స్ జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆంధ్ర యూనివర్సిటీ విసి కార్యాలయం ఎదుట టిడిఆర్ హబ్ పరిశోధక విద్యార్థులు నిరసన చేపట్టారు. టిడిఆర్ హబ్ పరిశోధక విద్యార్థుల పరిశోధన కొనసాగింపుకు సంబంధించి విసి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని, ఎపి ఆర్ సెట్ ద్వారా టిడిఆర్ హబ్‌లో ప్రవేశం పొందిన పరిశోధక విద్యార్థులను యథాతథంగా కొనసాగించాలని, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గల సంబంధిత విభాగాలలో కలపాలని డిమాండ్ చేశారు. వైవా పూర్తయిన తెలుగు పరిశోధక విద్యార్థికి తక్షణమే పిహెచ్‌డి అవార్డు ప్రకటించాలని కోరారు. ఏడు నెలల క్రితం రిపోర్టు వచ్చి వైవా కొరకు నిరీక్షిస్తున్న వివిధ భాగాలకు చెందిన ఆరుగురు పరిశోధక విద్యార్థులకు తక్షణమే వైవా నిర్వహించి పిహెచ్‌డిలు అందజేయాలని, పరిశోధన పూర్తయిన పరిశోధక విద్యార్థులకు ప్రతి మూడు నెలలకోసారి ప్రీటాక్ నిర్వహించాలని కోరారు. పిహెచ్‌డి ప్రవేశం పొందిన పరిశోధక విద్యార్థులకు 12 నెలలకు ప్రీ పిహెచ్‌డి పరీక్ష జరగాల్సి ఉండగా ఎపి ఆర్ సెట్ ద్వారా ప్రవేశం పొందిన 300 మందికి పైగా విద్యార్థులు రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఆ పరీక్ష నిర్వహించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వీటిని ఆయా విభాగాలు తక్షణమే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిఆర్ హబ్ పరిశోధక విద్యార్థులు సుమారు 80 మంది పాల్గొన్నారు. వారి ఆందోళనకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేద్కర్ మద్దతు తెలిపారు.

ఇళ్ల స్థలాలకు సిపిఐ దరఖాస్తులు

ప్రజాశక్తి- ములగాడ : పేద ప్రజలకు ఇంటి స్థలం కోసం జివిఎంసి 63వ వార్డు పరిధి భగత్‌సింగ్ జంక్షన్ వద్ద సిపిఐ ఆధ్వర్యాన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల కోసం పట్టణాల్లో ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు చొప్పున ఇచ్చారని, నిర్మించుకోవడానికి అవి సరిపడవని, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇస్తామని చంద్రబాబునాయుడు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు పేదలందరికీ స్థలాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ఇంతవరకు ఏ ఇంటి స్థలమూ లేని వారికి స్థలం మంజూరు చేసి పట్టా ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు, ఇ.కామేశ్వరరావు, వై.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం : సిఐ

ప్రజాశక్తి -ఆనందపురం : మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల జీవితాలు నాశనమవుతాయని ఆనందపురం సిఐ చింతా వాసునాయుడు పేర్కొన్నారు. మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన 'మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలన- యువత తెలుసుకోవలసిన జాగ్రత్తలు'పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తుపదార్థాలకు యువత బానిసకాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు సేవించే వారికి గరిష్టంగా శిక్షలు పడే అవకాశముందని చెప్పారు. భవిష్యత్తు ప్రణాళికలు, లక్ష్యాలపై యువత ఆలోచించాలని ఉదాహరణల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, డాక్టర్ పిఎస్.రాజు, చీఫ్ మేనేజింగ్ ఆఫీసర్, పిఐ హరగోపాల్, అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, వాలంటీర్లు సత్కరించారు.

జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. 'అడ్వాన్సెస్ ఇన్ జియో ఫిజిక్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్: ఎనర్జీ, ఎన్విరాన్మెంట్ అండ్ నేచురల్ రిసోర్సెస్"ను ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతరం నూతన సాంకేతికతలపై మెరుగైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటువంటి సదస్సులు నూతన జ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి ఎంతో ఉపయోగంగా నిలుస్తాయని చెప్పారు. జియో ఫిజిక్స్ రంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని, సాంకేతికతలను పరస్పరం పంచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. మేధో చర్చలకు, నూతన ఆవిష్కరణలకు అవకాశం కల్పించే విధంగా సదస్సు నిర్వహణ జరగాలని అన్నారు.

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహన్ మాట్లాడుతూ, ఎంతో దార్శనికతతో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జియో ఫిజిక్స్ విభాగ స్థాపన జరిగిందని చెప్పారు. ప్రాథమిక స్థాయిలో విభాగ అభివృద్ధికి బలమైన పునాదులను నిర్మించారని చెప్పారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అన్వేషణలు జరగాలని సూచించారు. సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన భారత్‌లో సముద్ర కెరటాలు, గాలి నుంచి కూడా విద్యుత్తును ఉత్పత్తి చేసే విధంగా సాంకేతికతను అభివృద్ధి జరపాలని సూచించారు. దేశానికి అవసరమైన విలువైన మానవ వనరులను ఏయు జియో ఫిజిక్స్ విభాగం అందించిందని చెప్పారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిడి జి.సుజిత్ కుమార్ త్రిపాటి మాట్లాడుతూ, గ్రీన్ హౌస్ గ్యాస్ విడుదల పెరగడం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. సుస్థిరమైన భవిష్యత్తుకు, పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు చూపే విధంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్.రాజు మాట్లాడుతూ, మానవుడు పర్యావరణంతో కలిసి జీవనం సాగించాలని సూచించారు. సహజ వనరులను వినియోగించే సమయంలో ఎప్పటికప్పుడు ఖచ్చితమైన వివరాలను అందించడం ఎంతో ఉపయోగంగా నిలుస్తుందన్నారు. హరిత ప్రాంతాల్ని పెంపొందించే దిశగా కృషి జరగాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య సివి.నాయుడు విభాగ ప్రగతిని, సదస్సు ముఖ్యాంశాలను వివరించారు. సదస్సులో ఆచార్య ఏ.లక్ష్మీపతిరాజు, ఆచార్య రాజేంద్రప్రసాద్, ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్యులు టి.హరినారాయణ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి



మందసలో మాట్లాడుతున్న విజయగౌరి

ప్రజాశక్తి - కంచిలి, మందస, టెక్కలి

విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. కంచిలి, మందస, టెక్కలి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం 117 జిఒను రద్దు చేస్తామని చెప్పినా, దాని స్థానంలో అలాంటి విధానాలతో మరో జిఒను తీసుకొస్తోందని తెలిపారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రతిఘటించేందుకు, ఉపాధ్యాయుల గొంతుకగా నిలిచేందుకు తనను గెలిపించాలని కోరారు. సిపిఎస్ రద్దు కోసం పోరాటం చేస్తానని, కెజిబివిలో సిఆర్‌టిలకు ఎంపిఎస్ విధానం అమలయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. కాంట్రాక్టు అధ్యాపకులకు 114 జిఒ అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. మోడల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే సర్వీస్ రూల్స్ వర్తించేలా చూస్తానని హామీనిచ్చారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రభుత్వమే సంక్షేమ నిధిని, బీమాను ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్ టు విధానాన్ని కొనసాగించాలన్నారు. యూనివర్సిటీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, నాయకులు జి.రమేష్, ఎన్.రవి, త్రినాథ్, దాసరి ఈశ్వరరావు, సనపల స్వప్న, కె.దాలయ్య, పాలవలస ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరి విజయానికి ప్రచారం

పద్మనాభం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి తరుపున మండలంలో ఆదివారం సాయంత్రం పలు ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. విలాస్‌ఖాన్‌పాలెం గ్రామంలో జరిగిన ఒక పెళ్లి వేడుకలో అక్కడికి వచ్చిన ఉపాధ్యాయులను అజశర్మ, దాసరి నాగేశ్వరరావు, కె.సన్యాసిరావు, అంబేద్కర్, బి.సన్యాసినాయుడు కలిసి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.



రోలుగుంటలో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

రోలుగుంట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా కోరారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రోలుగుంట, కుసర్లపూడి, కొమరవోలు, కొంతలం, బుచ్చింపేట, బీబీ.పట్నం జిల్లా పరిషత్ హైస్కూల్స్, రావికమతం మండలం కొత్తకోట జడ్పీ హైస్కూల్ సందర్శించి ప్రచారం చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ సెక్రెటరీ చిట్టియ్య, రోలుగుంట మండలం గౌరవ అధ్యక్షులు కేశవరావు, కార్యదర్శి వంశి, కొత్తకోట హైస్కూల్ యుటిఎఫ్ బాధ్యులు జల్లూరి ప్రసాద్, రాజేంద్ర, అలమండ శ్రీను పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న అజశర్మ తదితరులు

శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక పిడిఎఫ్

మాజీ ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శాసనమండలిలో ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై ప్రశ్నించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని మాజీ ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా విధానంపై తీవ్ర దాడి జరుగుతోందన్నారు. ప్రభుత్వ విధానాలు ప్రయివేట్‌ను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వం కళాశాలల్లో కొత్త కోర్సులు, సిబ్బంది నియామకం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థుల డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాటం ఫలితంగానే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని గుర్తు చేశారు. రాజకీయ పార్టీల తరుపున గెలిచే వ్యక్తులను శాసనమండలికి పంపితే వారిపై ఆయా పార్టీల పెత్తనం ఉండడంతో, వారు సమస్యలపై మాట్లాడే అవకాశం ఉండదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరిని గెలిపిస్తే ఆమె స్వతంత్రంగా వ్యవహరించి సమస్యలపై పోరాడతారని చెప్పారు. ఆయన వెంట జెవివి నాయకులు మురళీధర్, ఉద్యోగ సంఘాల నాయకులు కె.శ్రీనివాసు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రమణ్యం



యమునను అభినందిస్తున్న హెచ్ఎం తదితరులు

రగ్బీ క్రీడాకారిణి యమునకు అభినందన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : జాతీయ స్థాయి రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-15వ జాతీయ స్థాయి పోటీల్లో మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని శివాడ యమున పాల్గొన్నారు. మహారాష్ట్ర గ్వాలియర్ పట్టణంలో గల నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఈ నెల 12 నుండి నుండి 14 వరకు జరిగిన ఈ పోటీల్లో యమున ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించారు. జనవరి నెలలో గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అనకాపల్లి జిల్లా నుంచి పాల్గొని మెరుగైన ప్రదర్శన కనబరిచి ఉత్తరాంధ్ర నుంచి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఏకైక ప్లేయర్ కావడం విశేషం. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన రగ్బీ క్రీడలో రాణిస్తున్న యమున ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సత్యారావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సోమవారం అభినందించారు. ఈ రగ్బీ క్రీడను క్రీడాకారులకు పరిచయం చేసి, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికయ్యే విధంగా తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.

నేటి నుండి అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి-వడ్డాది : విద్యార్థుల నైపుణ్యతను అభివృద్ధి చేయడానికి అంగన్వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ ఈ నెల 18 నుండి 23వ తేదీ వరకు ఇస్తున్నామని ఎంఈఓ బొంజుబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి 5 సంవత్సరాల పిల్లలకు విద్యాబోధన, వారిలో నైపుణ్యతను పెంచడానికి మెరుగైన శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేపిడి జెడ్పీ హైస్కూల్లో ఆరు రోజులపాటు జరుగు ఈ శిక్షణకు అన్నిఅంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

టోరెంట్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ ఫార్మసిటీలో టోరెంట్ ఫార్మా పరిశ్రమలో ఆదివారం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు సోమవారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి సుధాకర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సక్రమమైన మాస్కులు, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలన ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులు పి రామకృష్ణ, జే బసవేశ్వరరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. భద్రత పాటించకపోవడం వలన ఘటన చోటు చేసుకున్నట్టు తోటి కార్మికులు తెలియజేస్తున్నారని తెలిపారు. క్షణక్షణం భయాందోళనలో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమలో భద్రత ఆడిట్ నిర్వహించి కార్మికుల రక్షణ భద్రతా సంక్షేమం గురించి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. క్షతగాత్రులకు కంటి చూపు మందగించే ప్రమాదం ఉందని యాజమాన్యం న్యాయమైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



ఆర్డిఒ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలలో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు బాలుర, బాలికల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త డాక్టర్ సి.ప్రభావతమ్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలలో బాలికలకు విశాఖపట్నం జిల్లాలో మధురవాడ, మేహాద్రి గెడ్డ, బాలురకు శ్రీకృష్ణాపురం, అనకాపల్లి జిల్లాలో బాలికలకు కోనాం, నర్సీపట్నం, కొక్కిరాపల్లి, నక్కపల్లి, బాలురకు గొలుగొండ, దేవరాపల్లి, సబ్బవరం గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులు మార్చి 6న మధ్యాహ్నం 12 గంటల లోపు సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతికి, మధ్యాహ్నం 2 నుండి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్‌కు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 0891-2799641 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఐద్వా ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : రాంబిల్లి మండలం పంచదార్ల స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన అనకాపల్లిలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డిడి వరలక్ష్మి మాట్లాడుతూ ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలు, చిన్నారుల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో ఎలమంచిలి, బుచ్చయ్యపేటలోనూ, ఇప్పుడు రాంబిల్లిలోనూ చిన్నారులపై దాడులు జరిగాయని తెలిపారు. దోషులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేపట్టి పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారులకు రక్షణ కల్పించి ఆ కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మద్యం, గంజాయి నియంత్రించాలని, ఫోన్లో వచ్చే అశ్లీల చిత్రాలను నిషేధించాలని కోరారు. జిల్లాలో మహిళా హోంమంత్రి ఉన్నా మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. మద్యం ,గంజాయి నియంత్రించాలని ఆడపిల్లలకు చిన్నారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు పార్వతమ్మ, నాగమణి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు



మాట్లాడుతున్న డిపిఓ శిరీషారాణి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి : డిపిఓ

ప్రజాశక్తి-కె.కోటపాడు

మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో, అలాగే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవలసిందిగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి పంచాయతీ విస్తరణాధికారులను ఆదేశించారు. అనకాపల్లి డివిజన్ పరిధిలోని పంచాయతీ విస్తరణాధికారులు, క్లాప్ మిత్రులు, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం మండలంలోని చౌడువాడలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఓ శిరీషారాణి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కోసం 12 థీమ్‌లు తీసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని డిపార్ట్మెంట్ల సహకారంతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రజల్లో అవగాహన కలిగించడం, వారి భాగస్వామ్యం పెంచడం, నీటి ద్వారా వచ్చే వ్యాధులను తగ్గించడం, పర్యావరణ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత వంటి కార్యక్రమాలు ఒక సంవత్సరం పాటు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ స్థాయి సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సమన్వయకర్త ఈ.నాగలక్ష్మి మాట్లాడుతూ అనకాపల్లి డివిజన్లో 520 సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయని, వాటన్నింటిని పూర్తిస్థాయిలో పనిచేసేటట్లు చూడాలని పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలను ఆదేశించారు. ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలని, వర్మీ కంపోస్ట్ తయారీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి, చౌడువాడ సర్పంచి దాడి ఎరుకునాయుడు. పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు, 12 మండలాలకు చెందిన ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో చోడవరం సర్పంచ్ భర్త మృతి




బండి శ్రీను (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీ సర్పంచ్ బండి నూకాలమ్మ భర్త శ్రీను (54) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో విశాఖపట్నం కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం శ్రీను మరణించారు. శ్రీనుకు ఇటీవల పొత్తులో నొప్పికి సంబంధించి చోడవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిగింది. కోరుకుంటున్న సమయంలో గుండెపోటు రావడంతో శ్రీను మృతి చెందాడు. మతదేహాన్ని చోడవరం తీసుకొచ్చిన తర్వాత బంధువులు, మిత్రులు ఊరేగింపుగా ఆయన నివాసానికి తీసుకొచ్చారు. శ్రీను మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు.

త్రిపురువానిపాలెంలో భరత్‌కుమార్ పర్యటన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని త్రిపురువానిపాలెం గ్రామంలో వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ మలసాల భరత్‌కుమార్ సోమవారం పర్యటించారు. వైస్ ఎంపిపి నమ్మి మీనాతో పార్టీ విషయాలపై చర్చలు జరపారు. అనంతరం నమ్మి సత్యనారాయణ నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, నమ్మి గణేష్, కొన నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



నమ్మి సత్యనారాయణ గృహ ప్రవేశానికి హాజరైన భరత్‌కుమార్

పాల రైతుల సమస్యలపై

మార్చి రెండో వారంలో చలో విశాఖ డెయిరీ

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-అనకాపల్లి

పాల రైతుల సమస్యలపై మార్చి రెండో వారంలో చలో విశాఖ డెయిరీ కార్యక్రమం నిర్వహించాలని పాల రైతులు, రైతు నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పాల రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రస్తుతం విశాఖ డెయిరీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ గత నవంబర్లో తగ్గించిన ఆవుపాలు ధర పెంచాలని, ఆవు పాలు కనీస వెన్న శాతాన్ని 2.8 శాతం నుండి 3.1 శాతానికి పెంచడాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 30 లీటర్ల కంటే తక్కువ పాలు పోసిన సెంటర్ల పాలు ఆపే నిర్ణయాన్ని విరమించుకోవాలని, బోనస్ ఆపిన రైతులకు వెంటనే చెల్లించాలని కోరారు. సేకరణ ధరకు మార్కెట్లో అమ్మకపు ధరకు ఉన్న వ్యత్యాసం ధరలో రైతుకు రూ.10 అదనంగా చెల్లించాలని, బోనస్ నాలుగు నెలలకు ఒకసారి ఇవ్వాలని, ప్రభుత్వం సహకార రంగంలో పాలు పోసిన రైతులకు లీటర్‌కు రూ.5 ప్రోత్సాహం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీపై శాసనసభ స్పీకర్ వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను, రైతులను కాపాడాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కొరకు మార్చి రెండో వారంలో చలో విశాఖ డెయిరీ కార్యక్రమానికి వేలాది మంది రైతులను సమీకరించి పోరాడి యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎపి పాల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు భూలోక నాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు నాయకులు నాయన బాబు, గాడి బాలు, రిటైర్డ్ ఎంప్లాయిస్ బి అప్పారావు, బ్రహ్మాజీ, ఆర్డీఎస్ అప్పారావు, రైతు మిత్ర సంఘం జిల్లా ప్రెసిడెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ

ఐదారు నెలలుగా రేషన్ అందడం లేదు

తహశీల్దారు కార్యాలయం ఎదుట జగనన్న కాలనీ వాసుల నిరసన



తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని మర్రిబంద గ్రామాన్ని ఆనుకొని ఉన్న జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న సుమారు వంద మందికి ఐదారు నెలలుగా ప్రభుత్వ రేషన్ బియ్యం అందకపోవడంతో వారంతా సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని అందుబాటులోని అధికార్లకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న లబ్ధిదారుల వివరాలు తహశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నప్పటికీ సివిల్ సప్లై అధికార్లు వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మూడు నాలుగు మండలాలకు ఒకే సివిల్ సప్లై అధికారి ఉండడంతో సమన్వయ లోపం జరుగుతోందని విమర్శలు వస్తున్నాయి. లబ్ధిదారులు వివరాలు అందిన వెంటనే వారికి రేషన్ సరుకులు అందే ఏర్పాటు చేయడం జరుగుతుందని సివిల్ సైప్లై డిటి నూకరాజు తెలిపారు. యలమంచిలి రామనగర్ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు కూడా ఇదే సమస్య ఉందని, అక్కడి లబ్ధిదారులు సైతం వాపోతున్నారు. ఎండియు వాహనదారులు, డీలర్ల మధ్య సమన్వయ లోపంతో అనేక సమస్యలు ఎదురౌతున్నాయని వాటిని వెంటనే పరిష్కరించడాలని కోరుతున్నారు. ఆందోళనలో రేషన్ అందని లబ్ధిదారులు ఎం అప్పలరాజు, పార్వతి, సరోజ, ఎం వీరలక్ష్మి, ఎస్ వరాలమ్మ. చిన్నారావు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు విస్తృత తనిఖీలు

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-కశింకోట : గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు కశింకోట మండలం తాళ్లపాలెం జంక్షన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, ఇతర రవాణా మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు (డైనమిక్ చెకింగ్) చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశించారు. కశింకోట పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఎస్‌పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగతిపై అధికారులను సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు, ప్రధాన కూడళ్ల వద్ద, ఇతర కీలక ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలను ప్రజల సహకారంతో ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. రౌడీ షీటర్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి పగలు గస్తీని మరింత పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో తరచూ సందర్శించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కశింకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.స్వామి నాయుడు, ఎస్సై మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జబర్దస్త్ సత్తిపండు కుమారుని వివాహానికి హాజరైన రాంకీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి సత్యస్ లక్ష్మీ గ్రాండ్ కళ్యాణ మండపంలో జరిగిన ప్రముఖ జబర్దస్త్ ఆర్టిస్ట్ సత్తిపండు కుమారుని వివాహ వేడుకలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చదరం నాగేశ్వరరావు, కర్రీ బాబి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనలో విఫలం

ప్రజాశక్తి-దేవరాపల్లి : గంజాయిని నిర్మూలించడంలో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ సెంట్రల్ జైలులో 2000 మంది ఖైదీలు ఉండగా, వారిలో 1200 మందికి పైబడి గంజాయి కేసుల్లో అరెస్టయిన అమాయక గిరిజనులేనని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గంజాయి నిర్మూలనకు 100 రోజుల ప్రణాళిక ప్రకటించిందని, కాని ఆచరణలో ఎక్కడ అమలు కావడం లేదని, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని ముఖ్యమంత్రి మాటలు నీటి మూటల్లాగే మిగిలాయని విమర్శించారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కాఫీ, మిరియాలు, పసుపు, అపరాలు, వలెసలు వంటి పంటలకు, ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర బిందువుగా ఉన్న ప్రశాంతమైన ఏజెన్సీ ప్రాంతంలో నేడు గంజాయి సాగు విస్తృతంగా సాగుతోందని పేర్కొన్నారు. దాదాపు రూ.35 వేల కోట్ల వ్యాపారం జరుగుంతోందని అంచనా అని, అంతరరాష్ట్ర గంజాయి ముఠాలు ఏజెన్సీలో గంజాయి విత్తనాల సరఫరా చేసి, పెట్టుబడులు పెట్టి సాగును ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. డబ్బులు ఆశ చూపించి గంజాయి రవాణాలో గిరిజన యువతను ఉపయోగించుకుంటున్నారని, వీరు పోలీసులకు అడ్డంగా దొరికి జైళ్లలో మగ్గుతున్నారని, తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకోన్ముఖంగా చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని విమర్శించారు. గంజాయి సామాజిక సమస్య అని, అమాయక గిరిజనులు గంజాయి సాగువైపు ఎందుకు వెళ్తున్నారో కారణాలు తెలుసుకొని, వారికి అవగాహన కల్పించి స్వచ్ఛందంగా గంజాయి సాగును అరికట్టాలని కోరారు. సమగ్ర దృక్పథంతో ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతోనే గంజాయి సాగు నియంత్రణ సాధ్యమన్నారు. ప్రత్యామ్నాయ వంటల వైపు గిరిజనులను ప్రోత్సహించాలని, అందుకు నీటి వనరులు, మార్కెట్, ఇతర సౌకర్యాలు కల్పించాలని, గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువతకు ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థల ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

విభాగాల పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ తుహిన్ సిన్హా మినిస్టీరియల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పోలీసు కార్యాలయం సంబంధించిన విభాగాల వారీగా (సెక్షన్ వైస్) సమీక్ష చేపట్టి చేశారు. సేవల నిర్వహణ, ఉద్యోగులు, విభాగాల పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక అంశాలను చర్చించారు. పోలీసు సిబ్బంది అభివృద్ధి, వృత్తి పరమైన శిక్షణ, సంక్షేమ పథకాలు, వారి సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉద్యోగుల్లో స్ఫూర్తిని పెంచేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ సిబ్బందికి మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు తగిన మార్గదర్శకాలను ఇచ్చారు. నూతన విధానాలు, సాంకేతికత వినియోగం, కార్యాలయాన్ని మరింత సమర్థంగా మార్చే విధంగా పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ సిబ్బందికి మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఏవో ఏ.రామ్‌కుమార్, సెక్షన్ సూపరింటెండెంట్‌లు కెవి.వరలక్ష్మి, పి.శేషు, ఎన్‌వి.గిరిబాబు పాల్గొన్నారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

▸▸ డిఎఫ్ఒ శామ్యూల్

ప్రజాశక్తి-గొలుగొండ : రానున్న వేసవిలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని నర్సీపట్నం డిఎఫ్ఒ శామ్యూల్ అన్నారు. సోమవారం కొప్పుకొండ నల్లగొండలో 62, 65 టేక్ ప్లాంటేషన్లను పరిశీలించారు. అనంతరం కృష్ణదేవిపేట అటవీ కార్యాలయం వద్ద నర్సరీలను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణదేవి పేట అటవీ కార్యాలయం నూతన భవన సముదాయ నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. రేంజ్ పరిధిలో 70వేల సంచి మొక్కలు ఏర్పాటుతో పాటు 100 బెడ్‌లలో టేక్ నర్సరీలో రైతులకు ఉపయోగపడే జామ నేరేడు సరుగుడు తదితర జాతుల మొక్కలను సిద్ధం చేస్తున్నామన్నారు. అడవుల అభివృద్ధితో పాటు, గ్రామాలను హరితమయం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ తోడ్పాటు అందిస్తామన్నారు కార్యక్రమంలో రేంజర్ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



నర్సరీ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డిఎఫ్ఒ శామ్యూల్

విశ్రాంత ఎంఇఒ ఔదార్యం

మత్స్యకార కుటుంబానికి ప్రతినెలా ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న విశ్రాంత ఎంఇఒ అమృతకుమార్

ప్రజాశక్తి-గొలుగొండ : విశ్రాంత ఎంఇఒ టి.అమృతకుమార్ ఔదార్యాన్ని చాటుకున్నారు. వు గత ఏడాది ఏప్రిల్‌లో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పడవ ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని పొగచెట్లపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు గరగల అప్పారా అప్పారావుకుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నారు. కుటుంబపెద్ద అప్పారావు మరణంతో జీవనోపాధిని కోల్పోయిన అతని భార్య రామలక్ష్మీ, ముగ్గురు ఆడపిల్లలను పరామర్శించిన విశ్రాంత ఎంఇఒ అప్పారావు, ఆమెకు వితంతు పింఛను మంజూరు కాకపోవడంతో, ప్రభుత్వం నుంచి పెన్షన్ వచ్చేంతవరకు తనకు వచ్చే పెన్షన్ సొమ్ము నుంచి ప్రతినెలా రూ.రెండు వేలు ఇస్తానని మాటిచ్చారు. ఈ మేరకు ప్రతినెలా ఠంచనుగా ఆర్థికసాయం అందిస్తుండగా, ఈనెల సాయాన్ని సోమవారం రామలక్ష్మికి రూ.2వేలు అందించారు..

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు హెటిరో డ్రగ్స్ సేఫ్టీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం పలు పోటీలు నిర్వహించారు. గృహ, ట్రాఫిక్ సేఫ్టీ అంశంపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు సేఫ్టీ పోటీలు నిర్వహించినట్లు కంపెనీ సేఫ్టీ డిపార్ట్మెంట్ ప్రతినిధి కల్లాయి రెడ్డి తెలిపారు. ఎంఇఒ నరేష్, ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు శాతం రిజర్వేషన్‌కు న్యాయపోరాటం

రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఎస్‌సి వర్గీకరణలో రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ కేటాయించకపోతే న్యాయపోరాటం చేస్తామని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు అన్నారు. సోమవారం మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి సమావేశంలో మాట్లాడుతూ రెల్లి కులస్తులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, తమకు ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. రిజర్వేషన్‌లో కూడా రెల్లి కులస్తులకు అన్యాయమే చేస్తే ఊరుకోబోమన్నారు. రాజకీయ ప్రాధాన్యత లేదని, అన్ని కులాలకు కార్పొరేషన్లు కేటాయించినా, రెల్లి కార్పొరేషన్ కేటాయించలేదన్నారుకార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బంగారు వెంకటేశ్వరరావు, మాట్లాడుతూ ఎబిసిడి వర్గీకరణలో రెల్లి కులస్తులకు జనాభా ప్రాతిపదికను కాకుండా అట్టడుగు వర్గానికి వర్గీకరణలో న్యాయం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో కోన అప్పారావు, దుర్గేశ్వరరావు, ఎస్.రాయవరం మండల నాయకులు బొరిశెట్టి కన్నారావు కుమార్, మాజీ జెడ్పిటిసి నీలాద్రిరావు, బుచ్చయ్యపేట మండల నాయకులు బంగారి నాగు, రావికమతం, రోలుగుంట, నక్కపల్లి, గొలుగొండ మండలాల రెల్లి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రెల్లి హక్కుల పోరాట సమితి నేతలు

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కోటేశ్వరరావు తెలిపారు. వచ్చే నెల 6వ తేదీలోపు ఆన్‌లైన్ విధానంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇంటర్‌లో ఎంపిసిలో 40, బైపిసిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

4న మోదకొండమ్మ తీర్థం

ప్రజాశక్తి.- మాడుగుల : ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, మాడుగుల మోదకొండమ్మ తీర్థ మహోత్సవాన్ని వచ్చేనెల 4న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ప్రత్యేకంగా సమావేశమై ఈ మేరకు ముహూర్తం నిర్ణయించినట్లు తెలిపారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు తెలిపారు.

ఆధార్ నమోదు, సవరణకు నేటి నుంచి ప్రత్యేక కేంద్రాలు

ప్రజాశక్తి - రావికమతం : ఈనెల 18 నుంచి 28 వరకు మండలంలోని రావికమతం, చీమలపాడు, దొండపూడి, కన్నం పేట, చినపాచిల, కొత్తకోట-1, తోటకూరపాలెం, కొమెర గ్రామాలలోని అంగనవాడీ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వెంకన్నబాబు తెలిపారు. ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

ఆక్రమిత స్థలం అప్పగించాలని నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని సీహెచ్.నాగాపురం పంచాయతీ పల్లావురు గ్రామస్తులు గొలుగొండ తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని గ్రామానికి అప్పగించాలని కోరారు. ఆక్రమణదారులకు అధికారులు కొమ్ము కాస్తూ ఒక వైపే మాట్లాడుతున్నారని ఆరోపించారు. తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పల్లావూరు గ్రామస్తులు

హైడ్రో పవర్ అనుమతులు రద్దు చేయండి

ఆదివాసీ గిరిజన సంఘం నేత అప్పలనర్స

ప్రజాశక్తి - చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాల అనుమతులను వెంటనే నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనరస అన్నారు. సోమవారం చింతపల్లి వచ్చిన సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చిట్టంపాడు, గుజ్జిలి గ్రామాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు రాష్ట్రప్రభుత్వం నవయుగ నిర్మాణ సంస్థకు అప్పగించిందన్నారు. ఈ నెల 6న క్యాబినెట్ సమావేశంలో వాటికి ఆమోదం తెలుపుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసిందన్నారు. ఆదివాసీల మనోభావాలు, పెసాచట్టం, గ్రామసభ తీర్మానం లేకుండా నిర్మాణాలు ఎలా చేపడతారని, ఆ నిర్మాణాలను వెంటనే రద్దు చేయాలన్నారు. మన్యంలో 1/70 చట్టాన్ని పరిరక్షిస్తామని గిరిజన చట్టాలను గౌరవిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని, దీంతో అఖిలపక్షం తలపెట్టిన 48 గంటల మన్యం బంద్‌ను విరమించుకున్నామన్నారు. ముఖ్యమంత్రి ప్రకటనలో స్పష్టత రావాలన్నారు. జిఒ 3 బిల్లు ప్రయోజనాల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని, ఈ నెల 24 నుంచి నిర్వహించే శాసనసభ సమావేశంలో దీనిపై బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఉద్యోగాల్లో గిరిజనులకు నూరుశాతం రిజర్వేషన్ కల్పించే ఈ జిఒ పునరుద్ధరణకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు, ఆదివాసీ గిరిజనసంఘం నాయకులు బోనంగి చిన్నయ్య పడాల్, ధనుంజయ్, చిరంజీవి, సూరిబాబు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

▸▸ టిటిడి చైర్మన్‌కు హోంశాఖ మంత్రి అనిత, టిడిపి నేతల వినతి

▸▸ వచ్చే నెల 10న కల్యాణోత్సవాలకు రావాలని ఆహ్వానం



టిటిడి చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న హోంమంత్రి అనిత, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమా వెంకన్న ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని విధాలా అభివృద్ధి చేయాలని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, స్థానిక టిడిపి నేతలు కోరారు. సోమవారం తిరుపతిలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వినతిపత్రం అందజేశారు. ఆలయ అభివృద్ధిపై ఛైర్మన్‌తో హోంశాఖ మంత్రి అనిత చర్చించారు. 2015లో టిడిపి హయాంలో ముఖ్య మంత్రి చంద్రబాబు ఉపమాక వెంకన్న ఆలయాభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానంలో విలీనం చేశారని, ఆనాడే ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ కూడా రూపొందించారని టీటీడీ ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆలయం అభివృద్ధి మరుగున పడిందన్నారు. శాశ్వత అభివృద్ధి పనులలో భాగంగా పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే విధంగా పూర్తిగా పునర్నిర్మించాలని, భక్తులు సౌకర్యార్థం ఎసి కల్యాణ మండపం నిర్మాణం , కొండపైకి వెళ్లే మెట్లు వెడల్పు చేసి షెడ్లు ఏర్పాటు, నక్కపల్లి నుండి ఉపమాక వరకు రోడ్డు విస్తరణ, కొండపైకి ఘాట్ రోడ్ నిర్మాణం, భక్తులకు విశ్రాంతి భవనం నిర్మాణం, ఆలయ పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం టిటిడి టికెట్ కౌంటర్ ఉపమాకలో ఏర్పాటు చేయాలని కోరారు. వచ్చేనెల 10న ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భారీ ఏర్పాట్లు చేయాలని,ఉత్సవాలపై ముమ్మరంగా ప్రచారం చేపట్టాలని కోరారు. స్వామి బంగారం ఆభరణాల అలంకరణ ఒక్కరోజు కాకుండా ఉత్సవాల్లో ముఖ్య దినాలైనా ఐదు రోజులు పాటు భక్తుల దర్శనార్థం ఉంచాలని, నిత్యాన్న దానం ఏర్పాటు చేయాలని కోరారు. ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలకు రావాలని టిటిడి ఛైర్మన్‌ను ఆహ్వానం చారు స్థానిక తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక వెంకన్న ఆలయ మాజీ ఛైర్మన్లు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, నాయకులు కొప్పిశెట్టి జగదీశ్వరావు, తోలేటి శ్రీను వున్నారు.

వేతనాలు పెంచాలి

● పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి ● పలుచోట్ల అంగన్‌వాడీల ధర్నాలు


భీమిలిలో ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత మణి


సబ్బవరంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు


యలమంచిలిలో సిఐటియు ఆధ్వర్యాన అంగన్వాడీల ధర్నా

కనీస వేతనం రూ.26వేలు అమలుతోపాటు గ్రాట్యూటీ, పిఎఫ్, ఇతర సమస్యల పరిష్కరించాలని, సమ్మె సమయంలో కుదిరిన ఒప్పందం మేరకు హామీలన్నీ అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీలు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. సిడిపిఒలకు వినతిపత్రాలను అందజేశారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

విశాఖ కలెక్టరేట్ : సమస్యలను పరిష్కరించాలంటూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి వేతనాలు పెరగకపోవడంతో అంగన్‌వాడీలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల పాటు అంగన్‌వాడీలు చేపట్టిన చారిత్రాత్మక సమ్మె నేపథ్యంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలపై స్పందించకుంటే మరో ఉధృత పోరాటం తప్పదని హెచ్చరించారు. తమ డిమాండ్లను తెలియజేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమ్మె కాలంలో చనిపోయిన వారికి కూడా అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని యాప్‌లనూ కలిపి ఒకే యాప్‌గా మార్పు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చెయ్యాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం మూడు నెలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జీవో ఇవ్వాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటలక్ష్మి, ఎల్.దేవి, అర్బన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు నూకరత్నం, కృపారాణి, జిల్లా కోశాధికారి పద్మ, ఉపాధ్యక్షులు శోభారాణి, నాగేశ్వరి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి జి.అప్పలరాజు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పి.మణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్పు చేయాలని కోరారు. అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.శ్రీదేవికి యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు ఆర్.వెంకటలక్ష్మి, అధ్యక్షులు ఎం.శ్రీదేవి, కార్యదర్శి కె.లక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి, 11 సెక్టార్ల లీడర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాది కావస్తున్నా అంగన్‌వాడీల సమస్యలపై ఒక్కరోజు కూడా మాటాడలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కార్యకర్తలు 42 రోజులు ఏకతాటిపై ధర్నా చేపడితే అప్పటి నాయకులు కొన్ని డిమాండ్ల పరిష్కారినిక హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదని తెలిపారు. నేటి ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బృందావతి, దేవి, భవాని పాల్గొన్నారు.

అనకాపల్లి : అంగన్వాడీల సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఐసీడీఎస్ అనకాపల్లి ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీల సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఓ ప్రభావతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఓ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం సమ్మె కాలపు మినిట్స్‌ని అమలు చేయకుంటే దశలవారీగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తనూజ, కృష్ణవేణి, ఉమా నారాయణమ్మ, సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే బర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు, యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండల కార్యదర్శులు సిహెచ్.శివాజీ, కె.సోమునాయుడు, సిహెచ్.రామకృష్ణ, యూనియన్ నాయకులు కె.రామలక్ష్మి, కెఎంఎస్.జయలక్ష్మి, ఎస్.సుజాత, బి.శశికళ, నారాయణమ్మ, వరలక్ష్మి, అంజలి, తులసీలక్ష్మి, పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి, సిడిపిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి కుమార్ మాట్లాడుతూ గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని, 164 సూపర్వైజర్ పోస్టను భర్తీ చేయాలని, ప్రీ స్కూళ్లను బలోపేతం చేసి, తల్లికి వందనం వర్తింపజేయాలని కోరారు. సిఐటియు నాయకులు ఈ.నాయుడు బాబు, ఎర్ర దేవుడు, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం సిడిపిఓ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఎపి వ్యకాస నాయకులు ఉప్పాడ సత్యవతి, యూనియన్ అధ్యక్షులు వివి రమణమ్మ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు జీతాలను పెంచాలన్నారు. అనంతరం సిడిపిఓ లలిత కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.రమణమ్మ, ఎం.రమణి, సిహెచ్.దేవి, సిఐటియు నేతలు ఎం గౌరేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : అంగన్వాడీలకు కనీస వేతనాలు, గ్రాట్యూటీ అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రదాన కార్యదర్శి జీ.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీల ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, లబ్ధిదారులకు విశేష సేవలు అందిస్తున్న అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. గతంలో 42రోజుల సమ్మె సమయంలో కుదిరిన ఒప్పందాల అమలులోనూ అంగన్వాడీలను మోస చేయడం తగదన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఆర్.రమణమ్మ, కార్యదర్శి సిహెచ్.మహాలక్ష్మీ, పి.వరలక్ష్మి, జ్యోతి, కృష్ణవేణి, వరలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు.

నక్కపల్లి : అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీను అమలు చేయాలని అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణీ డిమాండ్ చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం అంగన్వాడీ వర్కర్స్ ధర్నా చేపట్టారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు, పెండింగ్ లో ఉన్న సెంటర్ అద్దెలు, టిఎ బిల్లులు వెంటనే చెల్లింపు, అన్ని యాప్‌లు కలిపి, ఒక యాప్‌గా మార్పు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ, పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రావికమతం : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలంటూ రావికమతం ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు పి. వరలక్ష్మి, కార్యదర్శి సత్యవేణి , సిఐటియు ప్రధాన కార్యదర్శి వజ్రపు సత్యవతి పాల్గొన్నారు.

మాడుగుల : తమ సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన చేపట్టారు. సిడిపిఒ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు ప్రెసిడెంట్. ఆర్. రామలక్ష్మి , సెక్రెటరీ జానకి, ఎన్.కొండాజీ. బి.భాగ్యలక్ష్మి. మాట్లాడుతూ 42 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సిఐటియు మండల నాయకులు. ఇరట.నరసింహమూర్తి. ఆర్.దేముడు నాయుడు.కెభవాని పాల్గొన్నారు


అనకాపల్లిలో సిడిపిఒకు వినతిపత్రం అందజేత


రావికమతంలో అంగన్వాడీల ధర్నా


మాడుగులలో సిడిపిఒకు అంగన్వాడీల వినతి


కె.కోటపాడులో అంగన్వాడీల ధర్నా


నక్కపల్లిలో అంగన్వాడీల ఆందోళన